"అరిచే కుక్క కరవదా? ఏం నన్ను టెస్ట్ చేద్దామనుకుంటున్నావా....? చెయ్యి ..... చాలెంజ్." కోపంగా సగం కాలిన సిగరెట్‌ని విసిరేస్తూ అన్నాడు మధుకర్.

"అన్న మాటమీద విత్‌స్టాండ్ అవుతానంటే చాలెంజ్ ..... ఏం ఫ్రెండ్స్ ..... " అందరివేపు చూస్తూ అంది మహతి.

రోజూ వాళ్ళిద్దరిమధ్య ఉన్న గొడవ అందరికీ తెల్సిందే. ఏదో రకంగా మధుకర్‌ని కవ్వించడం మహతికి సరదా. మధుకర్ దాన్ని సీరియస్‌గా తీసుకుని నానా-రభసా క్రియేట్ చేస్తాడు.

ఆ చాలెంజ్ ప్రమాదకర స్థాయికి వెళుతుందని పసికట్టిన వాళ్ళు ఇద్దరే ఇద్దరున్నారు అక్కడ - వాళ్ళు మూర్తి, సుధారాణి- మధుకర్ ప్రస్తుతం ఏ స్థితిలో వున్నాడో వాళ్ళిద్దరికీ తెలుసు కాబట్టి.

మిగతావాళ్ళు ఆ చాలెంజ్ ఏమిటోనని వెయిట్ చేస్తున్నారు-

"చెప్పు ఏం చెయ్యమంటావ్., వూ ..... క్విక్ ..... " మెడలోని గోల్డ్ చెయిన్‌ని రఫ్‌గా సర్దుకుంటూ అన్నాడు మధుకర్ .

ఏ చాలెంజ్ చేసినా, మధుకర్ సాధిస్తాడని మహతికి తెల్సు, కానీ ఆ చాలెంజ్ వల్ల మధుకర్‌కి చాల నష్టం రావాలి. ఆ ఎఫెక్టు మధుకర్ తండ్రి అనుభవంలోకి రావాలి.

మహతి వేసిన ప్లాన్ అది. ఆ ప్లాన్ ఆమెను ఎంతవరకు తీసికెళుతుందో మాత్రం ఊహించలేకపోయింది.

పది సెకండ్లలో తనేం చాలెంజ్ చెయ్యాలో నిర్ణయించుకుంది మహతి.

"ఏస్ ..... మధుకర్ ..... దిసీజ్ చాలెంజ్ ..... కొత్తగా కన్‌స్ట్రక్టు చేసినిఓపెన్ అసెంబ్లీ హాల్ వుందా ..... అందులో హాల్ డెకరేషన్ కోసం పెట్టిన వండర్‌ఫుల్ స్టాచ్యూస్ పదిహేనున్నాయ్. వాటిని నువ్వు డిస్ట్రాయ్ చెయ్యాలి. చెయ్యగలవా ... ?"

“ఇంతేనా ..... ఏ తాజ్ మహల్నో పడగొడతావా ..... అని పందెం కడతావేమోననుకున్నా. నువ్వు చాలెంజ్ చేస్తే తాజ్ మహల్ని కూడా డిస్ట్రాయ్ చెయ్యడానికి నేను రెడీ ..... ” విసురుగా అన్నాడు మధుకర్ .

“అసెంబ్లీ హాల్ లోని స్టాచ్యూస్ డిస్ట్రాయ్ చెయ్యడమా ..... మహతీ నీకేం మతిపోయిందా ..... ఇట్స్ టూ బేడ్ ..... థింకిట్ ఒన్స్ ఎగైన్ ..... చాలా గొడవవుతుంది” సురేష్ అన్నాడు.

“మిష్టర్ సురేష్ ..... నేనన్నీ ఆలోచించే చెప్పాను ..... మధుకర్ చేస్తాడా? చెయ్యడా? నాక్కావలసింది అదే. మీ ఒపీనియన్ కాదు” సీరియస్‌గా అంది మహతి.

ఇద్దరికీ స్క్రూలూజెక్కువ, ఆపినకొద్దీ ఇద్దరూ రెచ్చిపోతారు ..... అందుకే వాళ్ళిద్దరికీ కుదిరింది. మరిక వాళ్ళిద్దరూ వెనక్కి తగ్గరని అక్కడున్న ఫ్రెండ్స్ అందరికీ తెల్సు!

అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

“ఎప్పుడు డిస్ట్రాయ్ చెయ్యాలి” అడిగాడు మధుకర్ .

“నో ముహూర్తం ఇప్పుడే” కవ్విస్తూ అంది మహతి.

“చాలెంజ్ నేను గెలుస్తా ..... గెలిస్తే ..... నువ్వేమిస్తావ్ ..... చెప్పు .....” మధుకర్ రెచ్చిపోతూ అడిగాడు.

“ఆ చాయిస్ నీకే ఇస్తున్నాను ..... ” అంది మహతి మరింత కవ్వింపుగా.

“చాయిస్ నాదేనా ..... ఒకే ..... అయితే విను ..... అందరూ చూస్తూండగానే నువ్వు నన్ను ముద్దుపెట్టుకోవాలి ..... ఒ.కే ..... ”

“ఒ.కే ..... డన్ ..... నేను ముద్దుపెట్టుకోవాలి అంతే కదా ..... అలాగేలే. మన స్టూడెంట్స్ అందరి ముందూ ..... అంతేకదా. మరోసారి చెప్తున్నాను. నా పెదవులు నీ పెదవుల్ని ఆ సమయంలో ఎక్కడ కనబడితే అక్కడ ముద్దు పెట్టుకుంటాయి. అంతే

కదా. ఫ్రెండ్స్ కదా. ఫ్రెండ్స్ ..... మీరేసాక్ష్యం ఎస్. అయామ్ రెడీ" అంది మహతి హుషారుగా.

వాడేదో ఆ వాల్యుబుల్ స్టాచ్యూస్‌ని డెస్ట్రాయ్ చేస్తాడటా. ఈవిడేమో పబ్లిగ్గా కిస్ ఇస్తుందట. బాగానే వుంది. మూర్తిగాడికి మాత్రం మహతి మాటల వెనక ఏదో మాజిక్ వున్నట్టనిపించింది.

"రెడీ ..... స్టార్ట్ ..... బయలుదేరు ..... మరి ..... " అంది మహతి.

మరే మాత్రం ఆలోచించలేదు మధుకర్ .

మహతి మీదున్న కసి తీర్చుకోడానికి సరైన అవకాశం దొరికినట్టనిపించింది మధుకర్‌కి. అదొక రకమైన హ్యూమన్ వీక్‌నెస్. శత్రువు నేమీ చెయ్యలేనప్పుడు ఆస్తిని నాశనం చెయ్యడం ..... ఆత్మానందం పొందడం ..... ఇలాంటిదే! గబగబా తన కారు వేపు నడిచాడు.

ఆ సమయంలో మధుకర్ తన తండ్రి రాఘవేంద్ర నాయుడు గురించిగానీ, మధుకర్ ఇండస్ట్రీస్ గురించిగానీ, తన తండ్రి ఇమేజ్ గురించిగానీ, ఆ తర్వాత వచ్చే నష్టాన్ని గురించి కానీ-

ఏ విషయమూ ఆలోచించలేదు.

కారెక్కి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. ఇగ్నీషన్‌కీ తిప్పి, కారు స్టార్ట్ చేసాడు. ఆర్ట్స్ కాలేజీ వెనక, వరసగా స్టూడెంట్ హాస్టల్సున్నాయి. ఆ హాస్టల్స్‌కి వందగజాల దూరంలో - అత్యాధునికంగా, అందంగా నిర్మించబడిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం - అంతకుమించి వీసీ రిటైరయ్యే ముందు తన అభిరుచులకనుగుణంగా అద్భుతమైన విగ్రహాలతో కట్టించిన ఆడితోరియం అది.

అటూ ఇటూ అందమైన నృత్యభంగిమల్లో పాలరాతి అమ్మాయిలు-

మధుకర్ డ్రైవింగ్ అంటే స్టూడెంట్స్ అందరికీ టెర్రర్!

ఆడిటోరియం వేపు ఎనభైకిలోమీటర్ల వేగంతో వెళ్తున్న ఆ కారు వేపే అందరూ చూస్తున్నారు.

ఏమైంది మధుకర్‌కి ఈజ్ హీ మ్యాడ్! ఏమిటిది?

వాళ్ళు ఆలోచించేలోపుగానే విధ్వంస కార్యక్రమం మొదలైంది.

ఎనభై మైళ్ళ స్పీడుతో పరుగెత్తిన మారుతీ ఒన్ థౌజండ్ మొదటి విగ్రహాన్ని డీకొంది. అంతే ..... అది తునాతునకలైపోయింది.

రెండు ..... మూడు ..... నాలుగు ..... అయిదు ..... ఆరు ..... ఎడు ..... ఎనిమిది ..... తొమ్మిది ..... పది ..... పదకొండు ..... పన్నెండు ..... పదమూడు ..... పద్నాలుగు .....పదిహేను.

ఒక్కొక్క విగ్రహాన్ని కారు డీ కొన్నప్పుడు, ఆ శబ్దం ఆర్ట్స్ కాలేజీవరకూ ప్రతిధ్వనించింది. సడన్‌గా ఏదో పాత బిల్డింగ్ కూలి పోతున్న శబ్దంలా వినిపించేసరికి - జనం ..... జనం ..... రోడ్ల మీదజనం ..... బస్సులోంచి దిగి చూస్తున్న జనం ..... ఎటు చూస్తే అటు జనం ..... పదిహేనో విగ్రహాన్ని ధ్వంసం చేశాక, అప్పుడు ఇహలోకంలోకొచ్చాడు మధుకర్. ఏదో పిచ్చిపట్టినవాడిలా వున్నాడు మధుకర్ .

కారు డోర్స్‌నిండా, వంటినిండా దుమ్ముధూళి అసలే సింగపూర్ డాల్‌లా వుండే మారుతీ 1000 కారు ఫ్రంట్ పార్ట్ అంతా డొక్కు డొక్కయిపోయింది. అందరూ గణేష్ నిమజ్జనాన్ని చూస్తున్నట్టు చూస్తున్నారు తప్ప, ఏ ఒక్కరూ వారించే ప్రయత్నం చెయ్యలేదు.

దగ్గరలోనే పోలీస్ స్టేషనున్నా, ఎస్.ఐ. లేకపోవడంవల్ల, పోలీసులుకూడా "ఏంది భయ్ ..... వీడిట్టా లొల్లి చేస్తున్నాడు." అనుకున్నారు తప్ప వాళ్ళూ ఏం చేయలేకపోయారు.

విజయగర్వంతో వందలమంది మధ్యనుంచి వచ్చిన మహతి మిత్ర బృందం పక్కన కారాపాడు మధుకర్ .

రీవిగా కార్లోంచి దిగి, ఎడంచేత్తో జుత్తు సవరించుకొని, మూర్తి అందించిన కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొని-

ఇప్పుడేమంటావ్ అన్నట్టుగా మహతి వేపు చూసాడు.

మహతి ఏమి అనలేదు.

చిన్న చిర్నవ్వు నవ్వింది.

కథ రక్తి కట్టబోతుందనుకున్నది.

మధుకర్ చేతిలో నాశనం అయిన ఆ విగ్రహాల విలువ పాతిక లక్షలు.

ఆ గొడవని కామ్ చెయ్యడానికి రాఘవేంద్ర నాయుడు పెట్టబోయే ఖర్చు ఎంత లేదన్నా మరో అయిదారు లక్షలు.

మహతి నవ్వింది. మళ్ళీ మళ్ళీ నవ్వుకుంది. ఆ నవ్వును అణుచుకోలేకపోయింది. బయటకు నవ్వేసింది. అలా పది నిమిషాలసేపు నవ్వుతూన్న వుంది. మహతి "ఎందుకలా పిచ్చిదానిలా నవ్వుతావ్ ..... స్టాపిట్ ఐసే ..... నేను గెలిచానా లేదా ..... రా కమాన్ ..... " పొగరు పొగరుగా అన్నాడు మధుకర్ .

"ఒకే ..... బాబూ ..... నువ్వే గెలిచావ్ ..... ఐ విల్ సెలబ్రేట్ దిస్ విక్టరీ ..... బట్ నాట్ హియర్ ..... సిటిజన్ క్లబ్‌లో ..... ఈవెనింగ్ సిక్స్ థర్టీకి ..... నువ్వో గ్రేట్ బిజినెస్ మాగ్నెట్ కొడుకువి ..... నీ ఎచీవ్‌మెంట్ అందరికీ తెలియాలి గదా ..... అందుకు ..... " ఆ చివరి మాట మధుకర్‌లో పనిజేసింది.

"ఒకె ..... షార్ప్ సిక్స్‌థర్టీ ..... మధుకర్ విజయగర్వంతో కారెక్కాడు. మూర్తి పక్కన కూర్చున్నాడు.

సాయంత్రం ఆరున్నరకు

సిటిజన్ క్లబ్‌లో, ఓపెన్‌గా మహతి మధుకర్‌ని ముద్దుపెట్టుకుంటుందట!

యూనివర్సిటీలో హాస్టల్స్ నిండా హాట్ హాట్‌గా ప్రచారమై పోయింది. ఈ హాట్ న్యూస్ సంచలనంలో - విగ్రహం ధ్వంసం విషయాన్ని స్టూడెంట్స్ పెద్దగా పట్టించుకోలేదు. కానీ యూనివర్సిటీ సెక్యూరిటీ ఆఫీసర్  హడావుడిగా వి.సిని కల్సాడు.

“పోలీస్ కేస్ పెడదామండీ-” సెక్యూరిటీ ఆఫీసరన్నాడు.

“వద్దయ్యా బాబూ ..... మధుకర్ ఎవడనుకున్నావ్ ..... రాఘవేంద్ర నాయుడు కొడుకు ..... రాఘవేంద్ర నాయుడుతో గొడవెందుగ్గానీ నువ్వెళ్ళు తర్వాత ఆలోచిద్దాం”

యూనివర్సిటీ వి.సి. నుంచి ఏ కంప్లయింటూ రాకపోవడంతో ఎస్.ఐ. అసహనంగా పోలీసుల మీద అరిచాడు.

*                    *                    *                    *

సిటిజన్ క్లబ్ .....

ఆ క్లబ్ మెంబర్‌షిప్ కావాలంటే, కోటీశ్వరులకు తప్ప మామూలు వాళ్ళకు దొరకదు.

ఎక్కువమంది బిజినెస్ పీపుల్ గేదరింగ్ ప్లేస్ అది.

ఆ రోజు ఎన్నడూలేనంత మంది గెస్టులు, అందులోనూ స్టూడెంట్స్ రావడంతో క్లబ్ మేనేజ్‌మెంట్ ముందు జాగ్రత్త చర్యగా అదనపు సెక్యూరిటీ ఏర్పాటు చేసింది.

“ రాఘవేంద్ర నాయుడుగారి అబ్బాయి, రాజేంద్ర ప్రసాద్ గారి అమ్మాయిని మన క్లబ్‌లో ఆరున్నరకు ముద్దుపెట్టుకుంటాట్ట ..... ”

అనెక్స్‌పెక్టుడుగా థ్రిల్లింగ్ ప్రోగ్రాం -ఫ్రీగా ఏర్పాటు కావడంతో మేనేజ్‌మెంట్ హాపీగా ఉంది.

“అయితే ఇవాళ తంబోలా కేన్సిల్ చెయ్యండి” క్లబ్ మేనేజర్ చెప్పాడు.

అప్పటికప్పుడు సిటిజన్ క్లబ్ హడావుడిగా కొన్ని ఏర్పాట్లు చేసింది. వీడియోగ్రాఫర్స్! ఫోటోగ్రాఫర్స్, ప్రెస్ రిపోర్టర్స్ .....

సరిగ్గా 6-10 నిమిషాలకు తెల్ల రంగు మారుతీకారు క్లబ్ గేటు ముందు ఆగింది. అందులోంచి రాజహంసలా మహతి, ఇంకో నలుగురు ఫ్రెండ్స్‌తో దిగింది.

దిగగానే ఎదురుగా కన్పించిన బోర్డును చూడగానే సిగ్గేసింది. కోపమొచ్చింది.

Welcome to Miss Mahati and Mr. Madhukar.

గేటుకు కొంచెం దూరంలో ఎడం ప్రక్కన టుడేస్ ఎంగేజ్‌మెంట్స్‌ని చూసి మరింత ఆశ్చర్యపడింది.

6.30 Kiss Programme

బాగానే ఉంది. ఇదేదో క్విజ్ ప్రోగ్రామ్‌లా ..... ఇంత హడావుడి ఎవరు చేసుంటారు?

ఆ మధుకరే ఇంత పబ్లిసిటీ చేసుంటాడు ..... ఎక్కడ చూసినా యూనివర్సిటీ స్టూడెంట్స్ వున్నారు.

క్లిక్ ..... క్లిక్ ..... ఫోటో గ్రాఫర్‌ల వలయం నుండి తప్పించుకుని లోపల, క్లబ్ మేనేజర్ రూంలో కెళ్ళిపోయింది మహతి.

సరిగ్గా 6.20 నిమిషాలకు- ది చైన్ '1991' కారు క్లబ్ గేటు ముందు ఆగింది.

బ్లూ కలర్ సూట్‌లో దిగాడు మధుకర్ . అతను కూడా మహతి లాగే ఆశ్చర్యపోయాడు.

"హమ్మ! మహతీ! ఎంత హడావుడి చేశావ్" చాలా థ్రిల్లింగ్‌గా ఎక్సయింటింగ్‌గా ఉంది.

హైదరాబాద్ క్లబ్స్ హిస్టరీలో తన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. గర్వంగా ఫీలయ్యాడు.

క్లిక్ ..... క్లిక్ ..... క్లిక్ ..... క్లిక్ .....

ఫోటోగ్రాఫర్ల దాడి.

"ఈ కిస్ ప్రోగ్రామ్ ఇన్‌స్పిరేషన్ ఏమిటి సార్"

ఇంకో డైలీపేపర్ రిపోర్టర్

"మార్నింగ్ యూనివర్సిటీ ఆడిటోరియంలోని విగ్రహాల్ని డిస్ట్రాయ్ చేశారట నిజమేనా సార్ ..... " ఇంకో ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ ఆసక్తి.

"ప్లీజ్ ..... వెయిట్ అండ్ సీ" వాళ్ళని తప్పించుకొని బిలియర్డ్స రూంలోకెళ్ళిపోయాడు మధుకర్ . అతని వెనక మూర్తి.

అదే సమయంలో అక్కడ ప్రత్యక్షమైంది సుధారాణి.

"వాటీజ్ దిస్ మూర్తి ..... వీళ్ళిద్దరికేం పిచ్చి పట్టలేదు కదా ..... "

"ఏమో ..... చెప్పలేం ..... రేపు మార్నింగ్ కానీ తెలీదు ..... " నవ్వుతూ అన్నాడు మూర్తి.

సరిగ్గా 6.30 నిమిషాలు.

కిస్ ప్రోగ్రాం కోసం, స్పెషల్‌గా నిలువెత్తు అద్దాలను అమర్చిన డయాస్.

అక్కడ- రెండే రెండు కుర్చీలు, గోల్డెన్ కలర్‌లో మెరుస్తున్నాయి.

దాదాపు అయిదువేలమంది జనం ఆత్రంగా .....

ప్రతిక్షణం వాచీవేపు చూసుకుంటూ నిరీక్షణం .....

మహతి, మధుకర్‌ల దగ్గర పర్మిషన్ తీసుకొని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ స్టేజెక్కాడు.

"మైడియర్ క్లబ్ మెంబర్స్-

ఈ రేర్ అండ్ ఎక్సయిటింగ్ ఈవెనింగ్‌లో పాల్గొన్న మీ కందరకూ క్లబ్ తరపున స్వాగతం పలుకుతున్నాను. యూనివర్సిటీ యూత్ పీపుల్ తమ కిస్ ప్రోగ్రామ్‌ని మా సిటిజన్స్ క్లబ్‌లో సెలబ్రేట్ చేసుకోవడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ మా మేనేజ్‌మెంట్ తరపున కంగ్రాట్స్ తెలియచేస్తున్నాము.

ఈ కిస్ ప్రొగ్రామ్ గురించి మీకెంత తెల్సో ..... మాకూ అంతే తెల్సు. ప్రోగ్రామ్‌ని థ్రిల్లింగ్‌గా సెలబ్రేట్ చెయ్యమని కోరుతూ ముందుగా మిస్ మహతిని ఆహ్వానిస్తున్నాను."